కూతురు కోసం

# మాన త్యాగం

రా భరద్వాజ

చలపతిరావు బైటికి వెళ్ళాడు. అంతవరకూ మంచంలో మూలుగుతున్న సుశీల లేచి కూచుని "అమ్మా" అన్నది నీరసంగా ఏడుస్తూ. సుశీలకు నెలరోజులనుంచీ జబ్బుచేసింది. అసలు సుశీల బతుకుతుందని ఎవ్వరూ అనుకోలేదు. ఎండిపోయి ఎమికలు వెళ్ళుకొచ్చినై. వొంటి నిండా చారెడేసి మచ్చలు. పైకి ఎవ్వరూ అనలేదుగానీ, అది 'సుఖరోగ'మని అందరికీ తెలుసు.

సుశీల నిజంగా పిచ్చిముండ, చలపతిని కావాలని చేసుకొన్నది. కాకపోతే అతని యీడవలు చాడవలు చూశా? ఆమాట చలపతి దక్కించుకోలేదు. సుశీల కాపరానికొచ్చి నాలుగుమాసాలయింది, మూడుమాసాలకల్లా మంచమెక్కి చచ్చి బతికింది. చలపతి వొట్టి దిక్కుమాలినవాడు.

తులశమ్మ ఏడుపు మరీ ఘోరం. ఒక్కగానొక్క కూతురు. బోలెడంత ఆస్తి. తండ్రి కాదంటున్నా వ్యతిరేకించి కూతురు ముద్దుచెల్లించింది. లేకలేక పుట్టిన బిడ్డ. ఆమె కింకెవరున్నారు? కూతురయినా కొడుకయినా సుశీలే. బోలెడంత కట్నం యిచ్చింది. నిజం చెప్పాలంటే అల్లుణ్ణి గూడా కడుపునబుట్టిన బిడ్డకు మల్లే చూస్తుంది తులశమ్మ.

ఆమె జన్మకి కావలసిందేమీలేదు. ఆయిద్దరు కాస్త పచ్చపచ్చగా తన కళ్ళ ముందు మసులుతుంటే చాలు. కూతురు పెళ్ళయిన తర్వాత ఆమెగారికి యిక బతికుండటం అవసరమనిపించింది. కానీ ఏం లాభం?

ఆ మురిపెం మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది. కూతురుకు పులిక తగుల్తున్నదని జాబొచ్చింది. గుండెపగిలి ఆవురుమంటూవొచ్చిపడింది తులశమ్మ. ఒచ్చినతరువాతగానీ ఆమెకు అసలుసంగతి తెలియలేదు. చలపతిపైకి ఎంత "మంచి" వాడిలా వుంటాడో అంత ముచ్చు. అతని ప్రవర్తనకు గిటురాయగా సుశీల ఆరోగ్యాన్ని తీసుకొంటే సరిపోతుంది.

మొట్ట మొదటగా సుశీల తల్లితో చెప్పలేదు. నిజం—దిక్కుమాలింది ఎంతకాలం బైటపడకుండా వుంటుంది? డాక్టరు చెప్పింగాకా అది సుఖరోగమని తులశమ్మకు తెలే తెలియదు.

"అయ్యో తల్లీ! నీకేంఖర్మం బట్టిందే!" అని ఏడిచింది తులశమ్మ.

ఈరెండు వారాలనుండి డబ్బు నీళ్ళప్రవాహానికిమల్లే ఖర్చు బెట్టింది. వెధవది డబ్బు లెఖ్ఖేమిటి? ఆకుర్రదాని శరీరం బాగుపడితే అదేపదివేలు ముష్టిడబ్బు. వున్నదిచాలదూ అనుభవించటానికి?

సుశీల కొంచెంకొంచెం పుంజుకొంటోంది! పది పదిహేను రోజుల్లో దాదాపు కుదురపడిపోతుంది. అయితే ఏమిటి లాభం? ఈకుర్రమైన శరీరంలోకి మళ్ళీ చలపతిరోగాల్ని ఎక్కిస్తాడు. మళ్లీ ఆరోగ్యం, రోగాలు ఎంతకాలం యిట్లా?

"అసలు సంగతేమిటమ్మా" అన్నాది తులశమ్మ! కూతుర్ని వొళ్లో కూచోబెట్టుకుని నిమురుతూ.

సుశీల ముందు చెప్పలేదు. తరవాత చెప్పింది తప్పదు గనక, అది తల్లిగనక.

"ఆయనవొట్టి రసపిచ్చిమనిషి ఘడియసేపు వూరుకోలేయ్యాడు. పిసినారి చంపుతాడు క్రూరంగా అనుభవిస్తాడు. ఒక్కోరాత్రి ప్రాణం విసుగు బుట్టేది చచ్చిపోతానేమోనని పించేది"

సుశీల ఆగింది సిగ్గుపడి

తులశమ్మ 'పిచ్చితల్లి' అనుకొంది మనసులో.

'చెప్పమ్మా"

"కాళ్ళమీదపడి దణ్ణం పెట్టేదాన్ని విదులించుకొని, వూసేవాడు. ఎక్కడికన్నా పోయి గడిపి వొచ్చేవాడు"

తులశమ్మ దీర్ఘంగా వూపిరి విడిచింది.

సుశీల ఏడుస్తూ తల్లినికావలించుకొని "అమ్మా! రోగాలతో ఈ ఘోరబాధలు పడేకంటే—అట్లా అకాసేపో కళ్ళమూసుకోవటమే నయంగావుంది" అన్నది. కాసేపాగి "కాస్తకాస్త కోలుకొంటున్నాను మళ్లీ అయన నాకు రోగాలు పట్టిస్తాడు ఈదఫా జబ్బొస్తే నేను బతకను ఏంచేసేది?"

తులశమ్మ కళ్లు తుడుచుకొంది.

"ఈమనిషికి మంచీచెడూ లేదు ఆడదయితే సరి—ఏదో నువ్వాన్నావని, ఏమైనా అనుకొని పోతావని నాలుగురోజులు అట్టట్టా వున్నాడు రోజూ పొద్దుపోయిన తరవాత పోయేది అక్కడికే నమ్మా!"

"ఎక్కడికి?"

"ఆరోహిణీలేదు! దానింటికి"

"నేచెబుతాలే తల్లీ! నువ్వూరుకో యాదవ బోకమ్మా! మరీ బరువు నేస్తుంది. నేచెబుతాగా!" అన్నది తులశమ్మ.

సుశీల అన్నదాంట్లో నిజం లేకపోలేదు ఈ దఫా మూలబడితే కోలుకోనిమాటనిజం అయితే తను చేయవల్సింది మరలా సుశీల మూలబడకుండా వుండటం—ఈరోగాల బాధలకంటే ఆ కాసేపూ బాధే సుశీల భరింపనగిందిగా వున్నదట పాపం దానిగుండె ఎంతగా మండిపోతే అట్లా అంటుంది' తులశమ్మ చాలా పొద్దుపోయిందాకా ఆవిషయాన్ని గురించి ఆలోచిస్తూనేవుంది.

ఇక పండుకొందామని దీపం తగ్గించేదానికి అటుగా వెళ్ళింది తులశమ్మ- చలపతి ఎప్పుడు వొచ్చాడో తెలీదు మంచంమీద వున్నాడు కళ్లు మూసుకొన్నా ఆతగాడు నిద్రపోవటల్లే వుంది, అటూఇటూ మసలుతున్నాడు. దీపం వెలుతురులో చలపతిని చూసింది కాసేపు. ఎట్లాగైనా యితన్ని రేపణ్ణించి రోహిణి యింటికిపోకుండా చేయాలి.

రాత్రివేళ యీదీపంకాంతిలో యింతఅందంగా వున్న చలపతి, ఈగొప్పను ఎంతకాలం దాచుకోగలుగుతాడు? తరవాత తన సుశీల గతేమిటి? వయసులోని సొబగులన్నీ రోహిణికి వొప్పగించి మిగిలిన పిప్పిని తన కూతురుకిస్తాడు ఇంత వున్నతాన్ని రోగాలపాలుచేసి, తను పాడయి, తనకూతుర్ని పాడుచేస్తాడు కూతురు సుఖం కంటే తనకు కావలసిందేమిటి? దానికి 'పిప్పి' తో సుఖంవదమని తనెట్లా చెప్పగలదు? కనీసం కూతురుకోసమయినా చలపతిని రోహిణి గడప తొక్కకుండా చెయ్యాలి మొగవాళ్ళ దేముంది. మనపాపం కాస్త చిరుతిండి పడేస్తే అంతామర్చిపోతారు.

తులశమ్మ దీపం పూర్తిగా తగ్గించింది. దాదాపు ఆర్పినంతగా మంచంవేపు నడవటానికి ఎందుకనో కాళ్ళు తడబడ్డయ్, గుండె కొట్టుకొంది

ఈదయపు లేతఎండలో యిద్దరూ మత్తుగా లేచారు. ఒకరినొకరు చూసుకొని నవ్వుకొన్నారు.

అంతే సుశీల మామూలుమనిషి అయిందాకా చలపతి రాత్రిళ్లు బయటికి వెళ్ళనేలేదు.